ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
21-12-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 102 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## కేటీఆర్ పై అన్యాయంగా కేసు నమోదు చేశారు

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు**



జయభేరి, హైదరాబాద్:

ఫార్ములా ఈకార్ రేసింగ్ ఈవెంట్ సందర్భంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ మాజీ మంత్రి కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేయడం పట్ల బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. తాజాగా, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఈ అంశంపై అసెంబ్లీలో మాట్లాడారు. కేటీఆర్ పై కేసు నమోదు చేయడం అన్యాయమని వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం మంచి పనులు చేస్తే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి గానీ, ఈ ప్రభుత్వం గానీ మేమేదైనా ప్రశ్నిస్తే, మమ్మల్ని దబాయించడం, ఎంక్వైరీ పేరిట అక్రమ కేసులు పెట్టడం, ఇదే కదా మీరు చేసేది అంటూ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా ఈకార్ రేసింగ్ తో హైదరాబాద్ ఇమేజ్ ను అంతర్జాతీయ స్థాయికి పెంచిన వ్యక్తి కేటీఆర్ అని కొనియాడారు. అటువంటి వ్యక్తి పై మీరు పెట్టిన కేసులో నిజం ఉందని అనుకుంటే, దమ్ముంటే ఆ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి మంచి పేరు రావాలనే కేటీఆర్ ఈకార్ రేసింగ్ జరపాలని నిర్ణయం తీసుకున్నారని, రేవంత్ ప్రభుత్వానికి భయం లేకపోతే ఈ శాసనసభలో చర్చ చేపట్టాలని అన్నారు.



2 లో

- షేక్ చేసిన ఫార్ములా ఈ కేసు
- సభలో తీవ్ర ఉద్రిక్తత... గందరగోళం
- 'ఫార్ములా ఈ 'రేసుపై ఏసీబీ కేసు మీద చర్చకు బీఆర్ఎస్ పట్టు
- అంగీకరించని స్పీకర్.. భూ భారతి బిల్లుపై చర్చిద్దామని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ సభ్యులు, మార్షల్స్‌కు మధ్య తోపులాట
- సభ వాయిదా పడి తిరిగి ప్రారంభమైనా కొనసాగిన ఆందోళన
- స్పీకర్ పట్టించుకోక పోవడం, అధికార పక్షం స్పందించకపోవడంతో సభ నుంచి నిష్క్రమణ

# తెలంగాణలో అసెంబ్లీలో గందరగోళం

జయభేరి, హైదరాబాద్,

తెలంగాణ అసెంబ్లీని ఫార్ములా ఈ కేసు షేక్ చేసింది. దీనిపై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ సభలోనే నిరసన చేపట్టింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసింది. సభ ప్రారంభం నుంచే బీఆర్ఎస్ సభ్యులు ఫార్ములా ఈ రేస్ కేసుపై చర్చకు పట్టుబట్టారు. సభకు వస్తూనే కేసుపై నిరసన చేస్తూ వచ్చారు. కేటీఆర్ పై పెట్టిన కేసు అక్రమమని నినాదాలు చేశారు. అందుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రశ్నోత్తరాల తర్వాత భూభారతి బిల్లుపై చర్చను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ధరణి పోర్టల్ ద్వారా అప్పటి ప్రభుత్వ పెద్దలు భారీగా కబ్జాలకు పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. ఈ పోర్టల్ వల్ల సామాన్యులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వాటన్నింటినీ గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో ప్రజలకు మేలు చేసే చట్టం తీసుకొస్తామని చెప్పామన్నారు. అందుకే ఇన్ని రోజులు వివిధ వర్గాల నుంచి సమాచారన్ని తీసుకొని భూభారతి చట్టం రూపొందించినట్టు తెలిపారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు భాగమయ్యారని వివరించారు. ఇది భూమి ఉన్న ప్రతి ఒక్కరికి కూడా చుట్టం

## ఈవీఎంల వ్యవహారంపై ఏకాకిగా కాంగ్రెస్



జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 20:

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ అంటేనే ఓ భారీ కసరత్తు. అటూ ఇటుగా 100 కోట్ల జనాభా పాల్గొనే ఈ ఎన్నికల ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించడం చూసి ప్రపంచ దేశాలే నివ్వెరపోతుంటాయి. ఇదంతా ఒకెత్తయితే.. దేశంలో జరిగే ఎన్నికల్లో గెలిచిన ప్రతిసారీ సంబరాలు చేసుకుని తమ ఘనతగా చాటుకునే కాంగ్రెస్ పార్టీ.. ఓడినప్పుడు మాత్రం ఈవీఎం 'గోల్‌మాల్' అంటూ గోల చేస్తోంది. ఆ పార్టీకి ఇది కొత్తేమీ కాదు. కానీ ఈసారి కనీసం మిత్రపక్షాల నుంచి మద్ధతు లభించకపోగా.. కాంగ్రెస్ తీరును తప్పుబడుతూ మిత్రపక్షాలే తలంటేస్తున్నాయి. మొన్న జమ్మూకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (JKNC), నిన్న తృణమూల్ కాంగ్రెస్ (TMC)లు కాంగ్రెస్ వాదనను తప్పుబట్టాయి. దీంతో ఈవీఎం

...మిగతాది 2 లో

## అంబేడ్కర్‌కు కాంగ్రెస్ చేసిందేమీ లేదు!

- జరుగుతున్న రగడపై స్పందించిన చంద్రబాబు



జయభేరి, విజయవాడ, డిసెంబర్ 20:

గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా అమిత్‌షా వివాదం కుదిపేస్తోంది. అంబేడ్కర్‌ను ఆయన అవమానించి రాజ్యసభలో మాట్లాడారంటూ దేశవ్యాప్తంగా విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఇందులో ఎన్డీఏ మిత్ర పక్షాలను లాగేందుకు ఇండీ కూటమి పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. కీలకంగా ఉన్న టీడీపీని టార్గెట్ చేశాయి. అందుకే మంత్రివర్గ సమావేశంలో దీనిపై క్లారిటీ ఇచ్చినట్టు తెలుస్తోంది. గురువారం మంత్రివర్గ భేటీలో అజెండాలోని అంశాలపై చర్చ పూర్తి అయన తర్వాత అంబేడ్కర్ అంశాన్ని చర్చకు పెట్టారు. అదే టైంలో పార్లమెంట్ అవరణంలో ఘర్షణ జరిగిందని కూడా తెలుసుకున్నారు. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి ఫోన్ చేసిన నారా లోకేష్ ఏం

...మిగతాది 2 లో

## కెటిఆర్‌పై ఈడీ కేసు నమోదు

జయభేరి, హైదరాబాద్:

మాజీ మంత్రి కేటీఆర్‌పై నమోదు అయిన ఫార్ములా ఇ కేసు చుట్టూ అనేక పరిణామాలు జరుగుతున్నాయి. ఇంత వరకు ఏసీబీ మాత్రం దీనిపై ఫోకస్‌డ్‌గా వర్క్ చేస్తుందని అంతా అనుకున్నారు. కాని ఇందులో 55 కోట్ల రూపాయల వ్యవహారం ఉన్నందున ఈడీ కూడా దృష్టి పెట్టినట్టు వార్తలు వస్తున్నాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టిఆర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌లో 2023 ఫిబ్రవరిలో జరిగిన ఫార్ములా ఇ రేస్‌కు సంబంధించిన ఆర్థిక అవకతవకలపై కేటీఆర్ సహా ఇతరుల పాత్ర ఉందని అనుమానిస్తున్న ఈడీ కేసు నమోదు చేయబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA) నుంచి

...మిగతాది 2 లో





## వేట కుక్కలా రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్

జయభేరి, హైదరాబాద్:

బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రానికి కాపలా కుక్కలాగా లేరని వేట కుక్కలా రాష్ట్రాన్ని దోచుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పరం చేశారని అన్నారు ఇదంతా ఓ పెద్ద దందా అని అన్నారు ధరణి పై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్ కు ఆదేశిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభలో ప్రకటించారు. అసెంబ్లీ లో భూ భారతి బిల్లు పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ధరణి పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1.50 వేల కోట్ల విలువ చేసే భూములు చేతులు మారాయని ఆరోపించారు. బిఆర్ఎస్

...మిగతాది 2 లో

## 55 కోట్లు కానే కాదు అక్షరాలా రూ. 600 కోట్లు..

- సీఎం రేవంత్ రెడ్డి సంచలన కామెంట్స్



జయభేరి, హైదరాబాద్:

ఫార్ములా ఈ రేస్ కేసు గురించి తాజాగా సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ కేసు అందరూ భావిస్తున్నట్లుగా రూ. 55 కోట్లకు సంబంధించింది కాదని, మొత్తం ఒప్పందం రూ. 600 కోట్లుగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఫార్ములా ఈ రేస్ కేసు పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చర్చ చేపట్టాలని తీవ్ర నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అలాగే స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి హంగామా చేసిన విషయం కూడా విదితమే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తాజాగా ఈ కేసు గురించి కీలక కామెంట్స్ చేశారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. తాను ప్రమాణ స్వీకారం చేసినప్పుడే ఎఫ్ఈఓ కంపెనీ ప్రతినిధులు తనను ప్రత్యేకంగా కలిసినట్లు, లోపాయి కారి ఒప్పందానికి తనను సహకరించాలని

...మిగతాది 2 లో

## 28న చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం




జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 20:

చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారు అయ్యింది. ఈ నెల 28న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి దీన్ని ప్రారంభించనున్నారు. దాదాపు రూ.430 కోట్ల వ్యయంతో చర్లపల్లి టెర్మినల్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ఇక్కడ ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం కల్పించనున్నారు.ఇక్కడ ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, ప్రయాణికుల కోసం వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు ఎంఎంటీఎస్ ప్లాట్ ఫాంలతో కలిపి 9 ప్లాట్‌ఫాంలు, 2 ఫుట్ఓవర్ బ్రిడ్జిలు, 6 ఎస్కలేటర్లు నిర్మించారు.చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైన తర్వాత 50 రైళ్లు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించనున్నాయి. ప్రతిరోజూ దాదాపు 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చర్లపల్లి 26 రైళ్లు ఆగుతున్నాయి. వాటిల్లో ముఖ్యంగా కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ, మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, పుష్‌పుల్, శబరి ఎక్స్‌ప్రెస్, శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, రేపల్లె ప్యాసింజర్, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ రైళ్లు ఉన్నాయి. చర్లపల్లి నుంచి రైళ్ల రాకపోకలతో హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లపై భారం తగ్గనుంది. అయితే.. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం అయిన తర్వాత స్టేషన్‌కు చేరుకునే మార్గంలో.. రోడ్ల విస్తరణ చేపట్టి ప్రజారవాణాను మెరుగుపరచాలనే డిమాండ్ ఉంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపితే.. ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. హైదరాబాద్‌కు తూర్పున చర్లపల్లి టెర్మినల్‌ను నిర్మించారు. దీనికి దగ్గర్లోనే ఘట్‌కేసర్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ ఉంది. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు.



2 లో

## కేటీఆర్ అరెస్టు అయితే.. తెలంగాణలో అల్లర్లు తప్పవా..!?

▶▶ మొదటిపేజీ తరువాయి

## అసెంబ్లీలో గందరగోళం

అవుతుందన్నారు పొంగులేటి. చర్చ సందర్భంగా కేసీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు పొంగులేటి. ఈ దేశంలో భూ సంస్కరణలు చేసిన పీవీ నర్సింహారావు. బూర్గుల రామ కృష్ణారావు కొండా వెంకటరంగారెడ్డి స్పూర్తితో దేశానికి రోల్ మోడల్‌గా ఉండే చట్టాన్ని తీసుకొచ్చామన్నారు పొంగులేటి. గత పాలకులు ప్రజల క్షేమాన్ని మరిచిపోయి తమకు తోచినట్టు నాలుగు గోడల మధ్య కూర్చొని చట్టాలు చేశారని విమర్శించారు. దొర చేసిన తప్పునకు చాలా మంది పేద రైతులు బలైపోయి ప్రాణాలు తీసుకున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగానే సభలో గొందరగోళం నెలకొంది. కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా ఈ కేసుపై చర్చించాలని నినాదాలు చేస్తూనే ఉన్నారు. పొంగులేటి మాట్లాడుతున్న టైంలో మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. ఆ క్రమంలోనే కొన్ని పేపర్లు చించి స్పీకర్‌పై వేయడంతో సభ ఆర్డర్ తప్పింది. బీఆర్ఎస్ చర్యలతో సీట్ల నుంచి లేచిన కాంగ్రెస్ సభ్యులు వారికి పోటీగా నినాదాలు చేశారు. ఇలా ఇరువర్గాలు ఒకరిపై కి ఒకరు దూసుకెళ్లారు. వాటర్ బాటిళ్లు ఇసురుకున్నారు. పరిస్థితి గమనించిన స్పీకర్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్దకు వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు, సభలో ఏం జరిగిందో వివరించారు. దళిత స్పీకర్‌ను బీఆర్ఎస్ నేతలు అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. హరీష్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి స్పీకర్‌ను కొట్టేంత పని చేశారని ఆరోపించారు. వారి సభ్యతం ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలా చేశారనే సంపత్, కోమటి రెడ్డిని సభ నుంచి బయటకు పంపించారని ఇప్పుడు బీఆర్ఎస్ నేతలను ఎందుకు బయటకు పంపించకూడదని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకులు కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ తమకు చెప్పులు చూపించారని ఆ వీడియోలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించిన శంకర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు కేసు పేరుతో నాటకాలు ఆడుతున్నారని అన్నారు.

ఎవరు తప్పు చేశారో అసెంబ్లీ చర్చ పెట్టి తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ఫార్ములా ఈ రేస్ కంటిన్యూ అయి ఉంటే టెస్లా వచ్చింది అన్నారు పాడి కౌశిక్ రెడ్డి. ఈ రేస్ వల్ల వేల మందికి ఉపాధి దొరికేది అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ మరింత పెరిగేదని పేర్కొన్నారు. ఈ కేసుపై చర్చ జరిపే వరకు అసెంబ్లీలో పోరాటం చేస్తామన్నారు బీఆర్ఎస్ నేతలు. అసెంబ్లీలో గొడవ జరిగిందని తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేశారు. అసలేం జరిగింది అని ఆరా తీశారు. సభలో జరిగిన గందరగోళాన్ని మంత్రులు ఆయనకు వివరించారు. సభ వాయిదా తర్వాత ప్రారంభమైనా బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. ఫార్ములా ఈ రేసింగ్‌పై చర్చ కావాలంటూ డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ గందరగోళంలోనే భూభారతిపై ప్రభుత్వం చర్చను కంటిన్యూ చేసింది. దీనిపై మరోసారి మాట్లాడిన పొంగులేటి భూభారతిపై చర్చ జరగకుండా బీఆర్ఎస్ కుట్ర చేస్తోందన్నారు. వేల పుస్తకాలు చేదివిన వ్యక్తి సూచలు సలహాలు ఇస్తారనుంటే సభకు రాకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆయన రాకపోకగా సభ్యులతో సభలో గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి రౌడీయిజం చెల్లదని అన్నారు. పొంగులేటి మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్ సభ్యులకు స్పీకర్ అవకాశం ఇచ్చారు. వాళ్లెవరూ మాట్లాడకపోయేసరికి బీజేపీ సభ్యులతో మాట్లాడించారు. బీజేపీ సభ్యుడు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ధరణిలో అన్ని అక్రమాలు జరిగాయని చెబుతున్న కాంగ్రెస్ విచారణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడిన తర్వాత కూడా సభ ఆర్డర్‌లోకి రాకపోవడంతో సభను మరోసారి స్పీకర్ వాయిదా వేశారు.

## వేట కుక్కలా రాష్ట్రాన్ని దోచుకున్న..

ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల లూటీ పై ఫోరెన్సిక్ ఆడిట్ చేసి నిజాలు నిగ్గు తేల్చుతామన్నారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం కొల్లగొట్టిన ఆస్తులను పేదలకు పంచుతామని ప్రకటించారు. దొరల స్వార్థం కోసమే ధరణిని తీసుకువచ్చారని మండిపడ్డారు మంత్రి పొంగులేటి. లిటిగేషన్లో ఉన్న భూములను పార్టీబీలో పెట్టి ఆ భూములను సక్రమం చేసుకున్నారని తెలిపారు. దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని, పాకిస్తాన్ వెళ్లిపోయారని అధికారులు నో అబ్జెక్షన్ చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అక్రమాలను నిగ్గు తేలుస్తామని ధ్వజమెత్తారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారని ఆయన ఫైర్ అయ్యారు. అసెంబ్లీ లో ప్రతిపక్ష నేత కనిపించరని, సభకు రారని సైటెర్లు వేశారు. రోజు కొక వేషంతో బీఆర్ఎస్ సభ్యులు డ్రామాలు ఆడుతున్నారంటూ మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఈవీఎంల వ్యవహారంపై కాంగ్రెస్

గోల్‌మాల్ ఆరోపణల విషయంలో కాంగ్రెస్ ఒంటరిగా మారింది. ఎన్నికల ప్రక్రియలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (EVM) ర్యాండమైజేషన్ చేస్తారు. ఆ తర్వాత మాక్ పోల్ కూడా నిర్వహిస్తారు. ఆ తర్వాతే ఎన్నికలు జరుపుతారు. ఇదంతా అన్ని పార్టీల ఏజెంట్ల ముందే చేస్తారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలోనూ పార్టీల ఏజెంట్లు ఉంటారు. వీటన్నింటితో పాటు EVMలపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేస్తూ 'ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్' (VVPAT) విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓటరు ఏ పార్టీకి ఓటు వేశారన్నది ఈవీఎం పక్కనే ఉన్న VVPATలో ఒక స్లిప్ ముద్రించి కొన్ని సెకన్ల పాటు కనిపిస్తుంది. ఆ తర్వాత ఆ స్లిప్ బాక్సులోకి జారిపోతుంది. ఓట్ల లెక్కింపు సమయంలో ర్యాండమ్‌గా కొన్ని ఈవీఎంలో వచ్చిన ఓట్లను, దానికి అనుసంధానించిన VVPAT స్లిప్పులను సరిపోల్చి చూస్తుంటారు. ఇప్పటి వరకు ఈవీఎం గణాంకాలకు, VVPATలో స్లిప్పుల లెక్కకు తేడా వచ్చిన సందర్భాలు లేవు. ఒకరకంగా చెప్పాలంటే ఇది బ్యాలెట్ విధానం కంటే కూడా మెరుగైన ఎన్నికల ప్రక్రియగా కితాబు అందుకుంది. బ్యాలెట్ విధానంలో ఓటర్లు తాము ఓటు వేయాలనుకున్న గుర్తుపై సరిగా ముద్ర వేయలేక, అనేక ఓట్లు చెల్లని ఓట్లుగా మిగిలిపోతుండేవి. EVMVVPAT వ్యవస్థలో అలాంటి చెల్లని ఓట్లకు స్థానమే లేదు. పైగా బ్యాలెట్ విధానంలో బూత్ క్యాప్చరింగ్ చేసి, తమకు నచ్చిన పార్టీకి ఓట్లు గుద్దేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. లేదంటే బ్యాలెట్ బాక్సులో ఇంకు పడేసి బ్యాలెట్ పేపర్లను ముద్రించిన ఓట్లను ధ్వంసం చేసే అవకాశాలు కూడా ఉంటాయి. ఇలాంటి సమస్యలు లేకుండా.. ప్రశాంతంగా జరుగుతున్న అతి పెద్ద ఎన్నికల ప్రక్రియలో అనేక రాజకీయ పార్టీలు పాల్గొంటూ.. ప్రజల ఆదరణ పొంది గెలుపొందుతున్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఓటమికి కారణం ఈవీఎం గోల్‌మాల్ అంటూ తమ వైఫల్యాలను ఈవీఎంల మీదకు నెట్టేసే ప్రయత్నం చేస్తోంది. నిజానికి ఈమధ్య జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటర్లను ఆకట్టుకోలేకపోయింది. కొద్ది నెలల వ్యవధిలో జరిగిన 4 రాష్ట్రాల ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో ఓడిపోయి, రెండు రాష్ట్రాల్లో కూటమిలో భాగమై గెలుపొందింది. గెలిచిన ఆ రెండు రాష్ట్రాల్లోనూ కూటమిలో భాగమైన ప్రాంతీయ పార్టీల బలమే కాంగ్రెస్ పార్టీని గెలిపించిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జమ్ముకాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ 56 స్థానాల్లో పోటీ చేసి 42 చోట్ల గెలుపొందితే, కాంగ్రెస్ 38 స్థానాల్లో పోటీ చేసి కేవలం 6 సీట్లు మాత్రమే గెలువగలిగింది. ఇక జార్ఖండ్ విషయానికొస్తే.. జార్ఖండ్ ముక్తి మోర్చా (JMM) 43 స్థానాల్లో పోటీ చేసి 34 స్థానాల్లో గెలవగా.. కాంగ్రెస్ 30 స్థానాల్లో పోటీ చేసి 16 స్థానాలు గెలుచుకుంది. హర్యానాలో ముఖాముఖి పోరులో బీజేపీతో తలపడగా.. స్వల్ప తేడాతో ఓటమిపాలైంది. మహారాష్ట్రలో కూటమిలో భాగంగా పోటీ చేసినా ఫలితం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజల్ని ఆకట్టుకోవడంలో ఎందుకు వైఫల్యం చెందుతున్నామన్నది గుర్తించకుండా.. ఓడిన ప్రతిసారీ ఈవీఎంలలో గోల్‌మాల్ జరిగిందని, అధికారపక్షం ఏదో మాయ చేసిందని ఆరోపిస్తోంది. ఒకవేళ అదే నిజమైతే బెంగాల్, హిమాచల్, తెలంగాణ, కర్ణాటక, జమ్ము కాశ్మీర్ రాష్ట్రాల్లో బీజేపీకి ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు గెలిచే అవకాశమే ఉండేది కాదు. గతంలో రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ గెలుపొంది ప్రభుత్వాలు నడిపింది. టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఈవీఎం విధానంలో జరిగే ఎన్నికలకు మద్దతుగా మాట్లాడారు. ఈవీఎంలపై ప్రశ్నలు లేవనెత్తేవారు తమ వద్ద ఏవైనా ఆధారాలుంటే ఎన్నికల కమిషన్‌కు వెళ్లి డెమో చూపించాలని అన్నారు. బెంగాల్‌లో వరుసగా రెండు పర్యాయాలు టీఎంసీని దెబ్బకొట్టి అధికారం సాధించాలని బీజేపీ శతవిధాలుగా ప్రయత్నించినా సరే, సాధ్యపడలేదు. అక్కడ తృణమూల్ కాంగ్రెస్ వరుసగా గెలుస్తూ వస్తోంది. ఇప్పటికే ఇండికూటమి నాయకత్వం విషయంలో అభ్యంతరాలు చెబుతూ కూటమికి తమ (మమతా బెనర్జీ) నాయకత్వం అవసరమని చెబుతున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి సమాజ్‌వాదీ (SP), రాష్ట్రీయ జనతా దళ్ (RJD), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (NCP) పార్టీలు సైతం మద్ధతు తెలిపాయి. ఇప్పుడు తాజాగా ఈవీఎం వాదన విషయంలో కాంగ్రెస్ తీరును తృణమూల్ తప్పుబట్టడంతో కాంగ్రెస్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

# కేటీఆర్ అరెస్టు అయితే..

# తెలంగాణలో అల్లర్లు తప్పవా..!?

- తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది బలిదానాల ఫలితంగానే రాష్ట్రం ఏర్పడింది...
- ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో కీలక పరిణామం
- మాజీ మంత్రి కేటీఆర్‌పై ఈడీ కేసు నమోదు
- ఫెమా ఉల్లంఘన, మనీలాండరింగ్ కింద కేసు నమోదు
- ఏ1గా కేటీఆర్, ఏ2గా అర్వింద్, ఏ3గా BLN రెడ్డి
- ఏసీబీ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన ఈడీ
- మరి కేటీఆర్ ఎప్పుడు వచ్చారు!? తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఏమిటి? కే టీ ఆర్ అరెస్టు అయితే తెలంగాణలో అల్లర్లు తప్పవని వస్తున్న సంకేతాలు ఇలాంటి రాజకీయ అంశాలపై "జయభేరి" కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర విశ్లేషణ...





✍ కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పది సంవత్సరాలు ఏకధాటిగా పరిపాలన చేసిన బిఆర్ఎస్ పార్టీ తానే రాజు తానే మంత్రిగా కొనసాగిన చరిత్ర మనందరికీ తెలిసిందే... ఇక వారి హయాంలో వ్యవస్థీకృత విధ్వంసం జరిగిందని గతంలో ప్రతి శాఖలో అవినీతి అన్యాయం జరిగిందని ఇసుక మాఫియా అంతులేకుండా పోయిందని ఆరోపణలు దొర పెత్తనం కింద తెలంగాణ రాష్ట్రం అనిగిమనిగి పోతుందని విసుగు మొత్తానికి ఆ పార్టీ పరాజయం పొంది మార్పు కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా సంవత్సరకాలం గడిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అసలు స్వరూపం బయటపడుతుంది.. ఈ కార్ రేస్‌లో కేటీఆర్ వందల కోట్ల రూపాయలు అన్యాక్రాంతంగా మళ్ళించారని వాటిపై అవినీతి నిరోధక శాఖ అలాగే ఈ డి శాఖలు దర్యాప్తు ముమ్మరించేశాయి. ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్ కూడా నమోదయింది. ఇదిలా ఉంటే కేటీఆర్ శాసనసభలో ఇదే విషయంపై చర్చ జరపాలని దమ్ముంటే మాట్లాడాలని వస్తున్న సెటైర్లు అంతకుమించి ఉన్నాయి.. ఇక హరీష్ రావు ఇంకో అడుగు ముందుకేసి అసలే మొదటి అడుగులోనే విజయం కేటీఆర్ పొందుకున్నాడని డబ్బా కొట్టుడు వాదనలు తెలంగాణ సమాజాన్ని ఎటువైపు మళ్లిస్తున్నాయి.. ఇదిలా ఉంటే కేటీఆర్ అరెస్టు అయితే కనుక కచ్చితంగా తెలంగాణ రాష్ట్రంలో అల్లర్లు మొదలయితాయి అన్న సంకేతాలు ప్రతిపక్ష పార్టీలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు చెప్పకనే చెబుతున్నారు...

**టిఆర్ఎస్ నాయకులకు ఒక సూటి ప్రశ్న... తెలంగాణ రాష్ట్రంలో కేటిఆర్ చేసిన ఉద్యమాలు వాటి ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందా అన్నది ప్రజల కంటే టిఆర్ఎస్ శ్రేణులకు ఎక్కువగా బాగా తెలుసు.. కేటీఆర్ తెలంగాణను అగ్రస్థానంలో నిలిపాడని ఆయన అరెస్టు అయితే కొన్ని గుండెలు ఆగిపోతాయని అల్లర్లు మొదలయితాయని చెప్పడంలో టిఆర్ఎస్ అసలు స్వరూపం బయటపడుతుంది. తెలంగాణ రాష్ట్రంలో మలిదశ తెలంగాణ ఉద్యమానికి పిలుపునిచ్చింది కేసీఆర్..అవినీతి జరిగిన అవినీతి జరగకపోయినా కేసిఆర్ పై వచ్చిన ఆరోపణలు కచ్చితంగా అధినేతగా ఆయన భరించుకోవాల్సిందే... కానీ ఆయన కడుపున పుట్టిన కేటీఆర్ కు అంత రాజకీయ అనుభవం లేకపోయినా ఎక్కడో ఉద్యోగం చేసే అతను మా నాయనను ఎందుకు చంపేస్తారు ఎవడికి కావాలి తెలంగాణ అన్న కేటీఆర్ ఏకంగా తెలంగాణకే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా మారిపోయాడు..**

ఆ పార్టీ నాయకులకు సమ్మగా ఉన్న అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడడం లేదు.. రాజకీయాల్లో కక్షపూరిత రాజకీయాలు మళ్లీ రాసుకుంటున్నాయా అనే ప్రశ్న తలెత్తక మానదు... తెలంగాణ రాష్ట్రంలో అన్నా అంటే కడుపున పెట్టుకొని చూసుకునే చరిత్రకు నిదర్శనంగా ఉన్న ఈ నేల రాను రాను రాజకీయ రణరంగంగా మారిపోనుందా!? ఒక్కొక్కటిగా బయటపడుతున్న బి.ఆర్.ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను అదేపనిగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బయటకు తీసుకొచ్చే పనిలో తల మునకల్ అవుతోందా!? ఏది ఏమైనా వరుసగా కలవకుండా కవిత అరెస్టు తర్వాత కేటీఆర్ ఆ తర్వాత కేసీఆర్ అన్న చందాన తెలంగాణలో రాజకీయం వేడెక్కుతోంది..

**తెలంగాణలో కాంగ్రెస్ పరిపాలనలోకి వచ్చిన తర్వాత సంవత్సర కాలం గడిచిపోయింది. ఇక ఇదే క్రమంలో ఫ్రీ బస్సు వల్ల అనేక నష్టం వాటిల్లుతున్న దాని పర్యవసానం ఇప్పుడు కనిపించదు రానున్న సంవత్సరాలలో దీని ఫలితం భారీ నష్టాన్ని కలిగించక మానదు. ఇక గ్యాస్ తగ్గింపు ఇల్లు లేని వారికి ఇళ్ళ పంపకాలు కొన్ని ఉద్యోగాలు ఇలా ఒక సంవత్సర కాలంలో కాంగ్రెస్ కొంత చేసినప్పటికీ జరిగిన నష్టం భారీగా ఉంది కాబట్టి రాష్ట్రాన్ని మరింత అప్పుల్లోకి నెట్టక తప్పదు అన్న చందనలో కాంగ్రెస్ అప్పులు తెస్తూనే ఉంది... ఇంకోవైపు లిక్కర్ ఏరులై పారుతున్న పట్టించుకునే నాధుడే లేడు...**

ఎన్నో సమస్యలతో తెలంగాణ రాష్ట్రం అటుడికి పోతున్న ఈతరణలో గత పాలకులు చేసిన అవినీతి బయటకి తీయొద్ద అన్న కోణంలో అధికార కాంగ్రెస్ పార్టీ భారీగానే కసరత్తు చేస్తోంది. మొత్తానికి కేటీఆర్ అరెస్ట్ అయితే ఎందుకోసం ధర్నాలు రాస్తారోకాలు చేస్తారో ఆ పార్టీ నాయకుల విజ్ఞతకే వదిలేయాలి. రాష్ట్రాన్ని రాష్ట్ర సంపాదన కేవలం ఆ ఒక్క కుటుంబమే ధారాధత్యం చేసినట్టుగా పది సంవత్సరాల పరిపాలన కొనసాగలేదా అన్నది ప్రజలు ఆలోచించాలి.. రాష్ట్రం ఏమైపోతే నాకేంది మా నాయన బతకాలి మా నాయనను చంపుతారా అని ఆనాడు అన్న మాటలు కేటీఆర్ మరిచిపోయాడు ఏమోగానీ ప్రజలు మరిచిపోలేదు... అలాంటి మనిషి కోసం తెలంగాణ ప్రజలు మళ్లీ ప్రాణాలు పోగొట్టుకుంటారా!? కేటీఆర్ అరెస్ట్ అయితే తెలంగాణ సమాజం అటు ఇటు పోతుందా!? ఇలాంటి సిల్లీ ప్రశ్నలు వాదనలు వింటే తెలంగాణ సమాజం నవ్వి ఊరుకోవాల్సిందే.... ఈనెల పోరాటాలకు పురిటి గడ్డ! తెలంగాణ అంటేనే పౌరుషాల పోరుగడ్డ! రాచరికపు దొరల పాలనను అంత చూసేదాకా బండి వెనక బండి కట్టి ఏ బండ్ల వస్తువు కొడుకు అని గర్జించిన పాటతో వేడెక్కిన తెలంగాణ సాహిత్యం ఎవరెస్టు శిఖరాన్ని తాకింది... అలాంటి ఈ నేల మీద రాజకీయం నడుస్తున్న రాజకీయ చరిత్ర రోజురోజుకు రూపాంతరం చెందుతూ తెలంగాణ రాష్ట్రం రాజకీయ కక్షలతో మారిపోకుండా విజ్ఞతతో తెలంగాణ సమాజం మసలుకోవాలి. తెలంగాణ సంపదను దోచుకున్న వారికి కచ్చితంగా శిక్ష పడాల్సిందే... కాళోజీ కవి అన్నట్టుగా ఇంటివాడైతే బొంద పెట్టు పరాయివాడైతే పారా ద్రోలు అన్నచందంగా ఇంటి వాడు తప్పు చేస్తే కచ్చితంగా బొంద తీసి పూడ్చివేయాల్సిందే... అలా కాకుండా ఆ పార్టీ నేతలు అతివినయం చూపిస్తే ఖచ్చితంగా వారు కూడా కారాగార ఊసలు లెక్క పెట్టాల్సిందే.... ఇలాంటి పని చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ అభివృద్ధిని ఎప్పుడూ మరచిపోకుండా చూసుకోవాలి... ఇచ్చిన హామీలు పక్కన పెడితే తెలంగాణ సంక్షేమాన్ని విద్య వైద్యం ఉపాధి అవకాశాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూ వాటికి మంచి బడ్జెట్ను కేటాయించాలి.. అరకురా బడ్జెట్లతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అంటే అంతకంటే వెర్రితనం ఇంకొకటి ఉండదు... రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకుపోయే లాగున ప్రజలు ఎప్పుడు సహకరిస్తున్నప్పటికీ పాలకుల వక్రబుద్ధి స్వార్థనీతి రాజకీయం తెలంగాణ సంపదను తెలంగాణ రాష్ట్రాన్ని మరింత వెనక్కి నెట్టేసి అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది... ఇక కేటీఆర్ అరెస్టయినా కేసీఆర్ అరెస్టయినా తెలంగాణకు ఒరిగింది ఏమీ లేదు... చట్టానికి రాజ్యాంగానికి అందరూ లోబడే పని చేయాలి. రాజ్యాంగానికి అతీతులు ఎవరు కాదు.. ఈ విషయాన్ని ప్రజల్లోకి తెలియచెప్పే బాధ్యతను ప్రతి మీడియా తమ భుజస్కందాలపై వేసుకోవాలి... రాజకీయ నాయకులు అంటే ఏ స్వార్థం లేకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవ చేస్తామని ముందుకు వచ్చిన వారే కదా... అలాంటి వారికోసం పనిచేయాల్సిన బాధ్యత ప్రజలది.కానీ స్వార్థంతో అవినీతితో వ్యవస్థీకృత విధ్వంసం చేసిన ఆ పరిపాలనలో అవినీతికి దాసోహం పొందిన నేతలను ఎంతటి వారైనా చట్టానికి దోషులుగా నిలబెట్టాల్సిన బాధ్యత ఖచ్చితంగా ఉంది... నేరారూపణ జరిగితే రుజువు పరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది... అరెస్ట్ అయితేనే అల్లర్లు మొదలు పెడతాం అన్న మాటలను పూర్తిగా ఖండిస్తూ జనరంజకంగా సాగుతున్న పాలన మరింత ప్రజా ఆమోదంగా ఉండేటట్టుగా చూసుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి ఎంతైనా ఉంది..

## కెటిఆర్‌పై ఈడీ కేసు నమోదు

ఫార్ములా E ఆపరేషన్స్ (FEO)కి కోట్లు బదిలీ చేశారని తేల్చినట్టు సమాచారం. ఇలా బదిలీ చేయడానికి సరైన అనుమతులు తీసుకోలేదని అంటున్నారు. ₹55 కోట్లను అనధికారికంగా బదిలీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో కేటీఆర్‌ను ఎ1గా పేర్కొంటూ ఇప్పటికే ఏసీబీ ఎఫ్ఐఆర్ ఫైల్ చేసింది. దీని ఆధారంగానే ఈడీ కూడా చర్యలకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఏసీబీ పేర్కొన్నట్టు ఇతర అధికారులపై కూడా ఈడీ దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు. ఈ కేసులో ఇప్పటికే తెలంగాణ ఏసీబీ నుంచి ఈడీ ఎఫ్ఐఆర్ కాపీ తీసుకోవడానికి ప్రక్రియ ప్రారంభించిందని తెలుస్తోంది. అనధికారికంగా ఈ కాపీని తీసుకున్న ఈడీ అధికారులు దీనిపై మంతనాలు చేస్తున్నారట. మొదట దీన్ని PMLA కింద కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా మరింత లోతుకు వెళ్లిన తర్వాత ఫెమా కింద కూడా కేసులు పెడతామంటున్నారట. హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా ఇ రేస్ కోసం కేటీఆర్ ఆదేశాల మేరకు ₹55 కోట్లను అధికారులు బదిలీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇలా బదిలీ చేయడం చట్టవిరుద్ధమని ACB FIRలో పేర్కొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై అనుమానం వ్యక్తం చేసిన ఆ రేస్ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. జరిగిన ఈవెంట్‌లో నిధులు దుర్వినియోగం, అక్రమాలపై విచారణకు ఆదేశించింది. తీవ్ర చర్చోపచర్చలు ఆధారంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ డిసెంబర్ 12న కేటీఆర్, అరవింద్ కుమార్‌ను విచారించేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో ప్రభుత్వ సీఎస్ ఆదేశం మేరకు, మున్సిపల్ శాఖ ఫిర్యాదుతో ఏసీబీ విచారణ చేపట్టింది. ఈ కేసు చాలా విచిత్రమైందని అన్న కేటీఆర్ న్యాయపరంగానే దీన్ని ఎదుర్కొంటామని అంటున్నారు. ఇప్పటికే కోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. ఇదంతా రాజకీయ కుట్రలో భాగమే అన్నారు. ప్రజాసమస్యల నుంచి ప్రజలను దృష్టిని డైవర్ట్ చేయడానికే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఈ కేసు న్యాయస్థానంలో నిలబడదని అంటున్నారు కేటీఆర్.

ఆర్థిక వనరుల సమీకరణపైన అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి డబ్బులు సేకరించవచ్చు అని సూచించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారులు నుంచి డబ్బులు సేకరిస్తున్న టీఓటీ విధానంలోనే.. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి డబ్బులను సేకరించాం' అని కేటీఆర్ వివరించారు. 'ప్రయివేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చినట్టు ఆరోపిస్తున్న రేవంత్.. ఆ కంపెనీతో లీజుని ఎందుకు రద్దు చేయడం లేదు. లక్ష కోట్ల అవినీతి అని గతంలో ఔటర్ రింగ్ రోడ్డు లీజుపైన రేవంత్ రెడ్డి మాట్లాడిన అడ్డగోలు మాటలపైన.. హెచ్ఎండీఏ పరువు నష్టం కేసు వేసింది. ఇప్పటికీ రేవంత్ రెడ్డిపైన హెచ్ఎండీఏ వేసిన కేసు అలాగే ఉంది. ముఖ్యమంత్రి ఔటర్ రింగ్ రోడ్డుపైన అనేకసార్లు కుంభకోణం అని మాట్లాడారు. మరి కుంభకోణం అంటున్న ఔటర్ రింగ్ రోడ్డు లీజ్‌ను ఎందుకు రద్దు చేయడం లేదు. రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ, హోంశాఖ మంత్రిగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో సిట్ ద్వారా తన కింద ఉన్న అధికారులతో వాస్తవాలు ఎలా బయటకు వస్తాయి' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'తన సొంత శాఖ అధికారులతో దర్యాప్తు చేస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయో రేవంత్ చెప్పాలి. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లీజ్ వెంటనే రద్దు చేసి.. సిట్టింగ్ జడ్జితో కానీ రిటైర్డ్ జడ్జితో కానీ నిష్పాక్షిక విచారణ జరగాలి. ఒకవేళ కుంభకోణం జరిగి ఉంటే.. ఆయాచితంగా లబ్ధి జరిగిన కంపెనీ కాంట్రాక్టు ఎందుకు రద్దు చేయడం లేదు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించకుంటే ఇది మరొక రాజకీయ కక్ష సాధింపు కేసు అని ప్రజలు అనుకుంటారు. జడ్జి ఏర్పాటు చేసే బృందం జాతీయ రహదారుల సంస్థ విధానాలను అధ్యయనం చేయాలని కూడా సూచిస్తాం. మాపై ఆరోపణలు చేసి కక్ష సాధింపుల కోసం మాత్రమే పరిమితం కాకుండా వాస్తవాలు తెలిసేలా మాట్లాడాలి' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని అభియోగం మోపింది. కేటీఆర్‌పై 4 సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. 13 (1) A, 13 (2) పీసీ యాక్ట్, 409, 120B కింద కేసు నమోదు చేశారు. దీనిపై కేటీఆర్ ఉన్నత న్యాయస్థానంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

## అక్షరాలా రూ. 600 కోట్లు..

వారు కోరినట్లు సీఎం అన్నారు. అలాగే ఏసీబీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో కేటీఆర్ నిన్న సాయంత్రం నుండి ఫార్ములా ఈ రేస్ గురించి చర్చించాలని హడావుడి చేస్తున్నారని, ప్రభుత్వ సొమ్మును వందల కోట్లు కొల్లగొట్టి ఇతర దేశాలకు తరలించినట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అదికూడా హెచ్ఎండీఏ అకౌంట్ నుండి నగదు బదిలీ చేశారని, ఈ విషయంలో ఒప్పందాలను ఉల్లంఘించి డబ్బులు తరలించినట్లు సీఎం విమర్శించారు. అందరూ భావిస్తున్నట్లుగా ఈ కేసు రూ. 55 కోట్ల వ్యవహారం కాదని మొత్తం ఒప్పందం రూ. 600 కోట్ల డీల్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏదైనా ఒప్పందం రద్దు చేయాలంటే విచారణ జరగాల్సిన అవసరం ఉందని, లండన్‌కు వెళ్లిన డబ్బు ఎవరెవరు చేతులు మారిందో ఎలా తెలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు అంతేకాకుండా ఆ డబ్బు పౌండ్ల రూపంలో వెళ్లిందని, స్పీకర్ అనుమతి ఇస్తే ఫార్ములా ఈ రేసు పై చర్చించడానికి తాము సిద్ధమంటూ సీఎం సవాల్ విసిరారు. అంతేకాకుండా ధరణి ప్రాజెక్టుపై మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ధరణి ద్వారా రైతుల డేటా సరిహద్దులు దాటిందని, వారు తలుచుకుంటే ఎవరి భూములనైనా తారుమారు చేయవచ్చు అంటూ సీరియస్ కామెంట్స్ చేశారు. ధరణి పేరుతో ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని, అటువంటివారిని వదిలి పెట్టే ప్రసక్తేలేదంటూ సీఎం హెచ్చరించారు. అంతేకాకుండా భూభారతి చట్టాన్ని ఆపాలని ప్రయత్నిస్తున్నారని, తమ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలనుకున్న తమ ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డు తగిలే ఆలోచన బీఆర్ఎస్ విరమించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## కాంగ్రెస్ చేసిందేమీ లేదు!

జరిగింతో తెలుసుకున్నారు. అనంతరం మంత్రి వర్గంలోనే చంద్రబాబు మాట్లాడుతూ అంబేద్కర్ వివాదంపై స్పందించారని తెలుస్తోంది. ఒక విషయంపై కానీ వివాదంపై స్పందించే ముందు చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని చంద్రబాబు సూచించారు. ఇప్పుడు అంబేద్కర్ విషయంపై మాట్లాడితే అసలు అంబేద్కర్ గురించి కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఆయన ఎప్పుడు గెలిచారు... ఓడించింది ఎవరు అనే విషయాలు ప్రస్తావించారు. చనిపోయిన తర్వాత కూడా పార్లమెంట్‌లో విగ్రహం పెట్టింది వీపీ సింగ్ ప్రభుత్వంలోనే అని తెలిపారు. అంబేద్కర్‌పైపై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సమర్థిస్తున్నారా లేదా ఖండిస్తున్నారా మీ వైఖరి ఏంటని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఏపీ సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. అంబేద్కర్‌పైపై అమిత్‌షా చేసిన వ్యాక్యలు సరికాదని వాటిని ప్రధాని కూడా ఖండించలేదని అన్నారు. అంతే కాకుండా వాటిని సమర్థించేలా కామెంట్స్ చేశారని తెలిపారు. ఇలాంటి అంశంపై చంద్రబాబు లాంటి వ్యక్తి లోతుగా ఆలోచించి స్పందించాలన్నారు కేజ్రీవాల్. అటు ఉద్ధవ్ ఠాక్రే కూడా కూటమి నేతలపై ఒత్తిడి తీసుకొచ్చింది. అమిత్‌షా చేసిన కామెంట్స్ వాళ్లు సమర్థిస్తారా లేకుండా వ్యతిరేకిస్తారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు, నితీష్ కుమార్ కీలకంగా ఉండటంతో ఈ వివాదంపై స్పందించాలని ఈ ఇద్దరిపై ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో పార్టీ నేతలు, మంత్రులు నోరు జారి కొత్త సమస్యలు తీసుకు రాకుండ ఉండేందుకు చంద్రబాబు మాట్లాడారు. పార్టీ, ప్రభుత్వం లైన్ ఏంటో చెప్పేశారు. మీడియా ముందుకు వచ్చినప్పుడు ఎలా మాట్లాడాలో చిన్న క్లాస్ కూడా తీసుకున్నారు.

# చైన్ స్నాచింగ్ నింధితుల అరెస్ట్

- చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పట్టుకున్న శామీర్ పేట్ పోలీసులు
- పావుతులం బంగారం, 2 వాహనాలు, సెల్ ఫోన్లు స్వాధీనం
- నిందితులను పట్టుకున్న పోలీసులను అభినందించిన ఏసిపి రాములు




**జయభేరి, డిసెంబర్ 20:**

చైన్ స్నాచింగ్ కు పాల్పడుతున్న ఇద్దరు నింధితులను శామీర్ పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి పావుతులం బంగారం, రెండు వాహనాలతో పాటు సెల్ ఫోన్లులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ మేరకు శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏసీపీ రాములు నింధితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన మూడుచింతలపల్లిలో వ్యవసాయ పొలం వద్ద దాన్యం ఎండపోసేందుకు వెళ్తున్న మహిళ మెడలోంచి ఇద్దరు గుర్తు తెలియని దుండగులు పుస్తెలుతాడు తెంచుకొని పారిపోయారు. అయితే ఈ కేసును ఛాలెంజ్ గా తీసుకున్న శామీర్ పేట్ పోలీసులు సీఐ శ్రీనాద్ నేతృత్వంలో 6 బృందాలుగా ఏర్పడి నింధితుల కోసం గాలింపు చేపట్టారు. ఇందుకు సుమారు 70 కిలోమీటర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 600 సీసీ కెమరాలను పరిశీలించి ఇద్దరు నిందితులను పట్టుకొని కటకటాలపాలు చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన నూనె అంజిరెడ్డి డ్రైవర్ గా పనిచేస్తూ కీసర మండలం బండ్లగూడలో నివాసం ఉంటున్నాడు. ఐటీకంపెనీలో క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తున్న సమయంలో బోడుప్పల్ కు చెందిన నరేందర్ రెడ్డి అలియాస్ నవీన్ రెడ్డి క్యాబ్ డ్రైవర్ తో పరిచయం ఏర్పడి స్నేహితులుగా మారారు. నరేందర్ రెడ్డి కారు కొనుగోలు చేసి అంజిరెడ్డిని డ్రైవర్ గా పెట్టుకున్నాడు. ఇదిలా ఉండగా అధిక సంపాదన లక్ష్యంగా ఈజీ మనీ కోసం దొంగతనాలు లక్ష్యంగా పెట్టుకునీ పథకం ప్రకారం చైన్ స్నాచింగ్ చేశారు. కారులో రెక్కీ నిర్వహించిన వీరు అదునుకోసం వేచి చూశారు. ఈ నెల 10వ తేదీన మూడుచింతలపల్లి లోనీ హరిహర దేవాలయం సమీపంలో వడ్లు ఎండ పోసేందుకు గ్రామానికి చెందిన మహిళ నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చి చైన్ స్నాచింగ్ చేశారు. అయితే మహిళ తీవ్రంగా ప్రతిఘటించడంతో దాదాపు పావుతులం బంగారు చైన్ తో పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ చోరిని ఛాలెంజ్ గా తీసుకొని సీసీ కెమరాలను పరిశీలించి విశ్వసనీయ సమాచారం మేరకు ఇద్దరు నింధితులను పట్టుకుని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. వీరి వద్ద నుంచి పావుతులం బంగారం, రెండు వాహనాలు, సెల్ ఫోన్లలను స్వాధీనం చేసుకుని నింధితులను రిమాండ్ కు తరలించారు. అయితే నింధితులను అతి తక్కువ సమయంలో పట్టుకుని కేసును చేధించినందుకు ఏసీపీ రాములు సీఐ శ్రీనాథ్, సీసీఎస్ సీఐ నాయుడు, డీఐ గంగాధర్, ఎస్సైలు హారీక, పరుశురామ్, దశరథ్, సిబ్బందిని అభినందించారు.



## కళ్యాణ లక్ష్మితో ఆడబిడ్డలకు ఆసరా ఏది..?

- గజ్వేల్ నియోజకవర్గ భాజపా నాయకులు వినోద్ కుమార్

**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 20 :**

ఆడపిల్లలకు రూ ఒక లక్ష తో పాటు తులం బంగారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెలలోనే పెళ్లిళ్లు చేసుకున్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని గొప్పలు చెప్పి ఇప్పటివరకు అమలు లేదని బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ నాయకులు వినోద్ కుమార్ మండిపడ్డారు . శుక్రవారం ఆయన మాట్లాడుతూ అంతేకాకుండా. ఏడాది కాలంలో ఒక గజ్వేల్ మండలంలోని 25 వేల మంది ఆడపిల్లలు పెళ్లిళ్లు చేసుకున్నారని గుర్తు చేశారు. ఏ ఒక్కరి కూడా కాంగ్రెస్ ఇచ్చిన హామీ పథకాలు అమలు చేయలేదన్నారు. ఏ సంక్షేమ పథకం పూర్తిస్థాయిలో ఆమలు చేయడం లేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని కాంగ్రెస్ మాట మార్చిందని అన్నారు. 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి కూర్చుందని అబద్ధపు హామీలతో కాలం గడుపుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం పై ఫైర్ అయ్యారు. భాజపా తరపున నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై తాము నిలదీస్తామని అలాగే గ్రామ గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తామని వారి సందర్భంగా తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ

- తనకు పదవి అప్పగించిన రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు
- తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షునిగా ఎంవి శ్రీనివాస్ ప్రభాకర్



**జయభేరి, డిసెంబర్ 20 :**

తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా లాల్ గడి మలక్ పేట్ లోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం వి శ్రీనివాస ప్రభాకర్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రభాకర్ మాట్లాడుతూ తనను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎంపిక చేసిన తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షులు రాజ గంగారెడ్డికి, కార్యదర్శి గిరిధర్ కి, ట్రెజరర్ తుకారాం, మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్షులు రామ్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర శాఖ మరియు జిల్లా శాఖ సహకారంతో ప్రధానోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా విద్యారంగ సమస్యలు, పాఠశాల మౌలిక వసతుల కల్పన కోసం తన వంతు పాటు పడతానని హామీ ఇచ్చారు.

# అమిత్ షా చేసిన వాక్యాలు వెనక్కి తీసుకోవాలి

**జయభేరి, హైదరాబాద్ :**



తెలంగాణ సమాజ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ విప్లవ్ ఆధ్వర్యంలో దిల్సుఖ్నగర్లో నిరసనగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. దీంట్లో విద్యార్థులు, అన్ని సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది. వినయ్ విప్లవ్ మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వాక్యాలు వెనక్కి తీసుకొని దేశ ప్రజలకు అంబేద్కర్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం జరిగింది.

అంబేద్కర్ కూడా ఒక దేవుడే, ఎందుకంటే జీవి తం తల్లిదండ్రులు ఇస్తే బ్రతుకు ఇచ్చింది మాత్రం అంబేద్కర్ అని భారతదేశంలో గుర్తించుకోవాలని ఈ కేంద్ర మంత్రి అయినటువంటి అమిత్ షా కు హెచ్చరిస్తున్నాం. నువ్వు పార్లమెంట్లో ఉన్నది కూడా అంబేద్కర్ వల్లనే కాబట్టి ఆయనను ఆయన గురించి మాట్లాడే ముందు నీ అర్హత తెలుసుకోవాలని ఈ భూమి ఉన్నంతవరకు అంబేద్కర్ బతికే ఉంటాడని అమీషాకు హెచ్చరిస్తున్నాం. అంబేద్కర్ అంటే ఒక నినాదం కాదు అంబేద్కర్ అంటే ఒక పొలిటికల్ యుద్ధ నౌక అనీ మర్చిపోవదని దిల్సుఖ్నగర్ కేంద్రంగా హెచ్చరిస్తున్నాం. తెలంగాణ సమా జ్ యూనియన్ తరపున అంబేద్కర్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. దీంట్లో తెలంగాణ సమాజ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వినయ్ విప్లవ్. విద్యార్థి నాయకులు పవన్ శ్రీను, మధు, పవన్, శ్రీకాంత్, రవి, వీరబాబు, చరణ్, రామ్, తదితర విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# తక్షణమే అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్

- కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మలను దగ్ధం చేసిన మాల మహానాడు నేతలు

**జయభేరి, డిసెంబర్ 20:**



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ను కించ పరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా ఉమ్మడి శామీర్ పేట మండల వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పలు చోట్ల అమిత్ షా దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. భారత రాజ్యాంగాన్ని రచించి మన హక్కుల సాధన కోసం కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, అలాంటి వ్యక్తిపై వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు బొమ్మేర్ల నాగరాజు, దళిత సేన మండల ప్రధాన కార్యదర్శి నీరుడి బాలేష్, లాల్ గాడిమలక్ పేట్ అధ్యక్షుడు కైర బాలు, మాజీ సర్పంచ్ కైర రమేష్, మాజీ వార్డు సభ్యుడు కనుకల లింగం, నాయకులు సుధాకర్, ఖాళిదాస్, శ్రీకాంత్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండలో టీఎస్ యూటీఎఫ్ 6వ రాష్ట్ర విద్యా మహాసభలు

- తూంకుంటలోని ఉన్నత పాఠశాలలో మహాసభల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన యూటీఎఫ్ నేతలు
- మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు

**జయభేరి, డిసెంబర్ 20 :**




ఈ నెల 28న నల్గొండ లో టీఎస్ యూటీఎఫ్ 6 వ రాష్ట్ర విద్యా మహాసభలు జరగనున్నాయి. కాగా ఈ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను మేడ్చల్ జిల్లా తూంకుంట లోని ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీఎస్ యూటిఎఫ్ శామీర్ పేట మండల అధ్యక్షులు పి. తిరుమలేశ్, జిల్లా కార్యదర్శులు దేవానాయక్, సత్యనారాయణలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 28 న నల్గొండ లో టీఎస్ యూటిఎఫ్ 6వ రాష్ట్ర విద్యా మహాసభలు ప్రారంభం కానున్నాయని, ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, యూటిఎఫ్ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు నాగ శారద, ఉపాధ్యాయులు వనజ, శ్రీనివాస్ రెడ్డి, శ్రీదేవి, మంజుల, భాగ్య, సత్తిరెడ్డి, పద్మప్రియ, తదితరులు పాల్గొన్నారు.



## చెట్లను పెంచడం మనందరి బాధ్యత

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

చెట్లను పెంచడం మనందరి బాధ్యత అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం బేగంపేట్ లోని నీరజ్ పబ్లిక్ స్కూల్ లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బ్రిటిష్ డెప్యూటీ హై కమిషనర్ MC Gareth Wynn Owen పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నీరజ్ పబ్లిక్ స్కూల్ ఫౌండర్ జ్యోతి రెడ్డి, ECO చైర్మన్ విశాల్ రాజ్, బండారి అఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్థిక భరోసాగా సీఎం సహాయనిధి

- చెక్కులను అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ జ్యోతిస్వామి



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 20 :**

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి హరీష్ రావు సహకారంతో కొల్గురు గ్రామనికి చెందిన నీరుడి నవీన్ కుమార్ S/O రాములు కు 60,000/రూపాయలు మరియు కురమ అంజయ్య కు 42,000/రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులు గ్రామ మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి ఆధ్వర్యంలో పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ గొల్ల స్వామి, గ్రామ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ ఎర్రవల్లి నరేష్ గౌడ్,నాయకులు పురం ఆంజనేయులు,దామగాళ్ల ప్రభాకర్, రాంపురం శివయ్య,గొడుగు రాజు,మల్లం సురేందర్,గొడుగు ఆగయ్య, కురుమ యాదయ్య,మాసన్పల్లి ఆంజనేయులు, నీరుడి సత్యం,నీరుడి యాదయ్య,కురుమ సత్తయ్య, కురుమ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎఫ్డిసి



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 20 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని మల్లన్న సాగర్ ముంపు గ్రామమైన పల్లే పహాడ్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గుగ్గులోతు శత్రు నాయక్ కుమార్తె పెండ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి. ఈ కార్యక్రమంలో హైమద్,కొమ్ము నరేష్ యాదవ్, నాగరాజు, స్వామి, శేఖర్, బాబు, కృష్ణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రామ, శివ నామ లిఖిత మహాయజ్ఞంలో పాల్గొనండి

- రామకోటి రామరాజు



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 20 :**

రామ, శివ నామ లిఖిత మహా యజ్ఞంలో పాల్గొని దేవదేవుల ఆశీర్వాదం పొందాలని రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షుడు రామకోటి రామరాజు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో రామకోటి రామరాజు ఆధ్వర్యంలో రామ, శివ లిఖిత పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ నామస్మరణ చేయాలని రామ, శివ లిఖిత మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ 20 వార్డు అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల పాక ఏం అన్నది రా బాబు..!

- పశువుల పాక కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 20 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో రాజా గౌడ్ అనే రైతు వ్యవసాయ పొలం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు పశువుల పాకను కూల్చివేసి రెండు లక్షల ఆస్తి నష్టం చేశారు. రైతు రాజాగౌడ్ వ్యవసాయ పొలం వద్ద పశువుల పాక దగ్ధం చేసిన వారిని పట్టుకుని శిక్షించాలని, వారికి న్యాయం చేయాలని కోరుతూ రాజగౌడ్ కుటుంబ సభ్యులు కన్నీటీ పర్యంతమయ్యారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమకేసులా..

- మాజీ ఎమ్మెల్యే ధర్మా రెడ్డి
- కక్షసాధింపులపై కాదు ప్రజాపాలనపై దృష్టి పెట్టండి

**జయభేరి, హన్మకొండ, డిసెంబర్ 20:**



హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఈ సందర్బంగా ధర్మా రెడ్డి మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన పక్కన పెట్టేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ లక్ష కోట్ల అవినీతి అన్నాడు ఫోన్ టాంపరింగ్ కేసులన్నాడు డ్రగ్స్ అని ఆర్భాటం చేశాడు ఒక్కటి కూడా రుజువు చేయలేక పోయిండు. ఇప్పుడు కొత్తగా ఈ కార్ రేస్ లో అవినీతి అని కొత్త డ్రామా మొదలు పెట్టాడు శుక్రవారం వస్తె కొత్త డ్రామా మొదలు పెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడు. ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమకేసులు పెట్టి అరెస్టులు చేయడం తప్ప ప్రజాపాలనపై దృష్టి పెట్టింది లేదు. ఈ కార్ రేస్ లో అవినీతి జరిగితే అసెంబ్లీలో చర్చపెట్టమని ఈ రోజు కూడా అసెంబ్లీలో అడిగితే దానికి సమాధానం లేదు పైగా అసెంబ్లీ సాక్షిగా పేపర్లతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేశారు. ప్రపంచ దేశాలలో జరిగే ఈ కార్ రేసింగ్ ని ఇండియాలో మన హైదరాబాద్ లో జరిగేలా కృషి చేసిన ఘనత కేటీఆర్ గారిది. ప్రపంచపటంలో తెలంగాణలోని హైదరాబాద్ ని నిలబెట్టిన ఘనత కేటీఆర్ ది. కేటీఆర్ నాయకత్వంలో ఐటి, ఇండస్ట్రియల్, ఫార్మా రంగాలు ఎంతో అభివృద్ధి చెందాయి. వేములవాడ రాజన్న సన్నిధిలో మీటింగ్ పెట్టి నీ ఒక్కని ప్లేట్ భోజనానికి రూ.32000/ బిల్లు పెట్టినవు.100 మందికి రూ.32 లక్షల బిల్లు పెట్టారట దానిపైన ఎంక్వైరీ లేదు. ఆరు నెలల నుండి ఏదో అక్రమ కేసు పెట్టి కేటీఆర్ ని అక్రమంగా అరెస్ట్ చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి. నీకు దమ్ముంటే కేటీఆర్ ని అరెస్ట్ చేసి చూడు ఏమవుతాదో తెలుస్తది. గ్రామాలలో పర్యటించండి అప్పుడు తెలుస్తది మీ పరిస్థితి మీ పార్టీ పరిస్థితి. ఇప్పటికి గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలపై చర్చించే సమయం నీకుండదు ఓవర్సీస్ స్కాలర్ షిప్ లో 20 లక్షల సాంక్షన్ చేయడానికి 5 లక్షలు అడుగుతున్నారనట దానిమీద ఎంక్వైరీ చెయ్. గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వలేదు. వారి కుటుంబాలు రోడ్డుపైన పడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రైతుబంధు పైసలు 7 వేలు పొంగులేటి ఇవ్వలేదా ?పొంగులేటిపై జరిగిన ఈడిదాడులు సంగతి ఏంది. ఇప్పటికైనా ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులు ఆపి ప్రజాపాలనపై, రాష్ట అభివృద్ధికై దృష్టి సారించితే మంచిది.

---



## అఖిల భారత పెన్షనర్స్ డే విజయవంతం

- తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ యందు అఖిల భారత పెన్షనర్స్ డే సందర్బంగా సినీయర్ పెన్షనర్స్ 30 మందిని శాలువ,మెమంటోతో సత్కరించడం జరిగినది అని అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి తెలియజేసినారు. సత్కారం పొందిన పెన్షన్ మిత్రులు ఆనందతో నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపినారు. కోశాధికారి పంగునూరు లింగయ్య మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం నకు ఆర్థికముగా, నిర్వహణలో పాలుగోన్న మిత్రులకు కృతజ్ఞతలు తెలిపినారు.జిల్లా అధ్యక్షులు వెంకట్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్ల శ్రీశైలం,జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్స్ డే చాలా చక్కగా నిర్వహించినారని సంతోషం వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్,పడమటి శాంతకుమారి కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్,గంధం వసంత, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి, ఆడిటర్స్ వనం బుచ్చయ్య, కె చెన్నయ్య, కార్యవర్గం సభ్యులు, సభ్యులు 80 మంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

## కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చెయ్యాలి

- కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్



**జయభేరి, దేవరకొండ :**

పార్లమెంట్ లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మనువాద ఆలోచనలతో అవమానకరంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అబేద్కర్ ని అవమానించినందుకు దేవరకొండ కోర్టులో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిరసన వక్త్యం చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ ద్వారా పదవి పొంది,ఆ రాజ్యాంగన్ని రాసిన మేధావిని అవమానించే విధంగా మాట్లాడడం మనువాద భావజాలం కలిన అమిత్ షా ను ప్రధాన మంత్రి మోడీ వెంటనే కేంద్ర కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ కొమ్ము రాజశేఖర్, టీపీపీసీ లీగల్ సెల్ నాయకులు ఎర్ర కృష్ణ జాంభవ్, సీనియర్ న్యాయవాదులు నెమ్మీకంటి రమశంకర్, వస్కుల శ్రీనివాస్, మాతంగి సురేష్,మద్దిమడుగు రామస్వామి, రాజ్ కుమార్, శంకర్ నాయక్, రామవత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

---

## బైకుల చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నియోజక వర్గంలో జరుగుతున్న వరుస బైక్ చోరీలను చెక్ పెట్టిన పోలీసులు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాలతో దేవరకొండ డి.ఎస్.పి నేతృత్వంలో కొండమల్లేపల్లి సిఐ మరియు ఎస్సై వారి టీం ప్రత్యేక బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను గుర్తించారు. నమ్మదగిన సమాచారం మేరకు వాహనాల తనిఖీలో భాగంగా కొండమల్లేపల్లి చౌరస్తాలో బైక్ దొంగల ముఠాను గుర్తించారు ఇట్టి దొంగలు ముఠాగా ఏర్పడి జల్సా లకు, చెడు అలవాట్లకు బానిసై రాత్రి సమయంలో ఇంటి ముందల ఓపెన్ ఏరియాలలో పార్కు చేసిన బైకులను టార్గెట్ చేసి వారి వద్ద తెచ్చుకున్న ఫేక్ కి ద్వారా బైకులను దొంగిలించారు, ఇట్టి దొంగలు కొండమల్లేపల్లి, గుడిపల్లి ,దేవరకొండ ,చింతపల్లి మాడుగుల, యాచారం మండలాల పరిధిలో సుమారు 17 బైకులు దొంగిలించినారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారి వద్ద నుండి వారి సుమారు పది లక్షల విలువ చేసే 17 బైక్ లను స్వాధీనపరచుకున్నారు. ఇట్టి కేసు చేదనలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ, ఎస్సైలు రామ్మూర్తి, నరసింహులు, క్రైమ్ సిబ్బంది హేము నాయక్, భాస్కర్, వెంకటేష్, శేఖర్ రెడ్డి, హోంగార్డు లక్ష్మయ్య, రమేష్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేసినారు.

---

## సిరిసిల్లలో మరో నేత కార్మికుడి ఆత్మహత్య

**జయభేరి, రాజన్న సిరిసిల్ల జిల్లా:**



సిరిసిల్లలోని గాంధీనగర్ కు చెందిన దూస గణేష్, 50 సం.లు, పద్మశాలి, అనే నేత కార్మికుడు గత సంవత్సర కాలం నుండి సాంచాలు సరిగా నడవకపోవడం వలన, ఉపాధి లేక, పని దొరకపోవడంతో అప్పులు కావడంతో నిన్న ఉదయం సూసైడ్ నోట్ రాసి, ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. గణేష్ కు భార్య సువర్ణ ఇద్దరు ఆడపిల్లలు సుమశ్రీ, పూజిత ఉన్నారు.

---

## బాలికల సమస్యలు పరిష్కరించాలి

- బొజ్జ హేమంత్ SFI ఆత్మకూరు మండలం ఇంచార్జ్

**జయభేరి, పరకాల, డిసెంబర్ 20:**



శుక్రవారం ఆత్మకూరు మండలంలోని తిరుమలగిరి కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం ముందు విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు, ఆత్మకూరు మండలం ఇంచార్జ్ బొజ్జ హేమంత్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు తెలుపుతుందని వెంటనే వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కరించాలని అలాగే కేజీబీవీలో మౌలిక వసతులు కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను అలాగే వారికి పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాన్ని ఆరోగ్య భద్రతను ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కేజీబీవీల్లో ఉన్న సమస్యలను వెంటనే స్థానిక విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బొచ్చు ఈశ్వర్, కోగిల సాయితేజ, యశ్వంత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---



## పోలా అశోక్ గుప్తా స్వగృహంలో అయ్యప్ప స్వామి శరణు ఘోష

**జయభేరి, చింతపల్లి :**

వెంకటేష్ నగర్ (మాల్) ప్రతిరోజు ప్రతి ఇంట్లో అయ్యప్ప స్వామి శరణు ఘోష. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని, ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలి రూపాయ ఖర్చు లేకుండా ,పూలు ,పుష్పం లేకుండా అయ్యప్ప శరణు ఘోష అయ్యప్ప గురు స్వామి. ఇడుకుల్ల భరత్ గురుస్వామి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ,సనాతన ధర్మం పాటించాలని మాల్ వెంకటేశ్వర్ నగర్, గోడకొండ్ల గ్రామానికి చెందిన అయ్యప్ప గురు స్వామి ఇడుకుల్ల భరత్ స్వామి అన్నారు. అయ్యప్ప ఇంటింటికి ప్రతిరోజు శరణు ఘోషలో భాగంగా చింతపల్లి మండల సూర్య రిపోర్టర్ పోల లక్ష్మి అశోక్ గుప్త దంపతుల ఆహ్వాన మేరకు మాల్ వెంకటేశ్వర్ నగర్ లోని వారి గృహంలో ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ గురుస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రూపాయ ఖర్చు లేకుండా, పూలు, పుష్పం, ఎలాంటి ఆర్భాటం, ఖర్చు లేకుండా ,ప్రతి ఇంట్లో మా స్వాములు అందరూ వచ్చి శరణు ఘోష చెప్పి వెళ్లిపోతారని, దీన్ని ఆయా గ్రామాల ప్రజలు, అయ్యప్ప భక్తులు వినియోగించుకోవాలని ఆయన స్వాములను కోరారు. అయ్యప్పకు వేల రూపాయల ఖర్చులు అవసరం లేదనీ, కాళీ శరణు ఘోష చాలు అని అన్నారు.ఈ శరణు ఘోష కార్యక్రమంలో మల్లోజు గణేష్, కోటి, శివ, శ్రీకాంత్, రాజేష్, పాలకర్ల కృష్ణ, మౌనిక వస్త్రాలయం జగదీష్ కుమారుడు, చింటూ, వినీత్, శేఖర్ స్వామి, కన్నె స్వాములు, వివిధ గ్రామాల అయ్యప్ప స్వాములు, గ్రామంలోని సన్నిధానం స్వాములు 50 మంది అయ్యప్పలు, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారని గురు స్వామి తెలిపారు. అదేవిధంగా ప్రతిరోజు ప్రతి ఇంట్లో శరణు ఘోష కార్యక్రమం నిర్వహించాలని గురుస్వామి కోరారు. పోల. లక్ష్మి అశోక్ దంపతులు, హర్షిత, మణిదీప్, రామేశ్వరమ్మ తదితరులు ఉన్నారు. అదేవిధంగా శనివారం గోడకొండ్ల వేణుగోపాల స్వామి దేవాలయంలో అయ్యప్ప శరణు ఘోష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భరత్ గురుస్వామి, అయ్యప్ప స్వామి భక్తులు తెలిపారు. ఈ శరణు ఘోష కార్యక్రమంలో గ్రామ ప్రజలు ,అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు.

---

## సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు పోలీస్ శాఖ సంకల్ప కార్యక్రమం

- ముఖ్య అతిధిగా సిఐ మల్లికార్జున రావు

**జయభేరి, పరవాడ :**




అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణల ఆదేశాల మేరకు జిల్లాలో గల అన్ని స్కూల్ లకు మాదకద్రవ్యలు, సైబర్ క్రైమ్, లైసెన్స్ లేని డ్రైవింగ్ వంటి విషయంలపై పోలీస్ శాఖ వారు అవగాహన కార్యక్రమంను సంకల్ప పేరుతో నిర్వహిస్తున్న విషయం విధేయమే.ఈ కార్యక్రమం లో భాగంగా పరవాడ సిఐ ఆర్. మల్లికార్జునరావు సంస్కృతి గ్లోబల్ స్కూల్ ను సందర్శించి స్కూల్ విద్యార్థుల తో ముచ్చటించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, లైసెన్స్ లేని వారు మోటర్ బైక్ లు నడిపితే ఎంతటి నేరమో,మాదకద్రవ్యలకు ఎలా బానిసలు అయిపోతున్నారు అనే విషయలు పై చిన్నారులకు విశధీకరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ సీతాలక్ష్మి, సీఈఓ కె. నిశాంత్, పరవాడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

---

## విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.... ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేక, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించేందుకే కేటీఆర్ పైన చిల్లర కేసులు పెట్టడం జరిగింది అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ పరువు తీసేలా ఫార్ములాఈ వాళ్ల తోనే కేసులు వేయించుకున్నావ్. రేస్ జరుపు తామని అగ్రిమెంట్ చేసుకొని మధ్యలో రద్దు చేసినందుకు, వాళ్లు రేవంత్ ప్రభుత్వం మీద కేసు పెట్టారు అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీలాంటి చిల్లర గాళ్ల కేసులకు భయపడే వాడు ఎవడూ బిఆర్ఎస్ పార్టీలో లేడు అని ఆయన అన్నారు.ఫార్ములా ఈ రేస్ తో తెలంగాణ, హైదరాబాద్ కు ఏం 700కోట్లు లాభం వచ్చింది అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఎన్నిరకాల అటెన్షన్ డైవర్షన్ పనులు చేసినా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేసేదాకా వదిలిపెట్టం. రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటం అని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు TVN రెడ్డి, గాజుల ఆంజనేయులు, బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, వేముల రాజు, బోడ్డుపల్లి కృష్ణ, పల్లా లోహిత్ రెడ్డి, రమావత్ ఉమెందర్ కుమార్, రమావత్ తులిసిరామ్, ఖాదర్ బాబా, అఫోజ్, తరి గోవర్ధన్, గుండాల వెంకట్ ,శ్రీను నాయక్, తదితరులు ఉన్నారు.

---

## ఘనంగా ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం సెయింట్ మేరీస్ హై స్కూల్లో శుక్రవారం ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బల్ల నక్షత్రం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకలలో విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బల్ల నక్షత్రం మాట్లాడుతూ ఆకారం వేరైనా అన్ని మతాల సారం ఒక్కటే అని అన్నారు. కరుణామయుడు యేసు క్రీస్తు ప్రభువు జన్మదిన సందర్భంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ అని అన్నారు. ప్రపంచంలో చాలా దేశాలలో జరుపుకునే పండుగ క్రిస్మస్ పండుగే అని,ఏసుక్రీస్తు శాంతికి చిహ్నం అన్నారు.యేసు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించి సమాజంలో ఉత్సాహంగా, ఉల్లాసంగా ముందుకు సాగి ఉత్తమమైన జీవితాన్ని కొనసాగించాలని కోరుకుంటూన్నానని తెలిపారు .తమ మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలని గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ రేఖ, బాల, సునంద, నూస్రత్, స్వాతి, కరుణ, లక్ష్మి, రమణ, జబ్బార్, రంజాన్ బేగ్, అబ్దుల్ రజాక్,నవీన్,కొండల్, లింగం, చందర్,సిరాజ్ ఉల్ హాక్ తదితరులు పాల్గొన్నారు.

---

## తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

- గౌరవ అధ్యక్షుడిగా పూర్మాని రాంలింగా రెడ్డి, అధ్యక్షుడిగా మోర శ్రీకాంత్

**జయభేరి, రాజన్న సిరిసిల్లా జిల్లా:**



తంగళ్ళపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మోర శ్రీకాంత్ ను క్లబ్ సీనియర్ పాత్రికేయుల సహకారంతో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గం.. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మోర శ్రీకాంత్ (నవతెలంగాణ), ఉపాధ్యక్షుడిగా దుబ్బాక రాజు (దిశ), ప్రధాన కార్యదర్శిగా రెడ్డి రాజశేఖర్ (ఆంధ్రప్రభ), కోశాధికారిగా గదగోని సాగర్ (బలగం), సహాయ కార్యదర్శిగా గ్యాదనవేని మధు (క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ఇంగ్లీష్ పేపర్), సాంస్కృతిక కార్యదర్శిగా రెడ్డిమల్ల దేవరాజు (నేటి తెలంగాణ), ముఖ్య సలహాదారులుగా సామల గట్టు (నమస్తే తెలంగాణ), వెంగల శ్రీనివాస్ (సాక్షి) ఏకగ్రీవమయ్యారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు జలగం అనిల్ కుమార్ (సూర్య) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మోర శ్రీకాంత్ మాట్లాడుతూ.. తంగళ్ళపల్లి మండల ప్రెస్ క్లబ్ ను 2017 లో రి. నెం.638/2017 తొ స్థాపించామని, అప్పటినుండి నేటి వరకు మండలంలోని పాత్రికేయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పలు సమస్యలను పరిష్కరించుకున్నాం. నూతనంగా వచ్చిన కొందరు పాత్రికేయలకు ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.




# ఓ స్త్రీ న్యాయపోరాటం..

మలయాళ అగ్ర నటుడు సురేశ్‌గోపి, అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'(జె.ఎస్.కె). యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రవీణ్ నారాయణన్ దర్శకుడు. జె.ఫణీంద్రకుమార్ నిర్మాత. ఉత్కంఠకు గురిచేసే కోర్ట్ డ్రామాగా ఈ సినిమా రూపొందిందని, జానకి అనే స్త్రీ తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టు ద్వారా ఎలా ఎదుర్కొన్నది అనేదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తమని, కేసు వాదించే లాయర్‌గా సురేశ్‌గోపీ నటించారని, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. బైజు సందోష్, మాధవ్ సురేశ్‌గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రెనదివ్, సంగీతం: గిరీష్ నారాయణన్, జిబ్రాన్, నిర్మాణం: కాస్మోస్ ఎంటైర్టైన్మెంట్స్.






## చూడ్డానికే అమాయకంగా

'మా నాన్న స్టేజ్ ఆర్టిస్ట్. ఆ ప్రభావం నాపై తెలియకుండానే పడింది. అందుకే కెరీర్ పరంగా వేరే ఆప్షనేం పెట్టుకోలేదు. సెకండ్ ఇంటర్ అవ్వగానే జమ్ము నుంచి ముంబై వచ్చి యాక్టింగ్ కోర్స్‌లో చేరిపోయాను. కోర్స్ అవ్వగానే ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టా. కొన్ని యాడ్స్‌లో నటించా. హీరోయిన్‌గా 'డ్రింకర్ సాయి' నా తొలి సినిమా' అని తెలిపింది ఐశ్వర్యశర్మ. 'డ్రింకర్ సాయి' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నది. ధర్మ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించింది ఐశ్వర్యశర్మ. 'ఇది అద్భుతమైన ప్రేమకథ. ఇందులో నా పాత్ర పేరు బాగీ. మెడికల్ స్టూడెంట్‌ని. చాలా బలమైన పాత్ర. చూడ్డానికి ఇన్నోసెంట్‌గా కనిపిస్తా. కానీ రఫ్ అండ్ టఫ్‌గా ఉంటా. రెగ్యులర్ హీరోయిన్లకు భిన్నమైన పాత్ర అనమాట. ఛాలెంజ్‌గా తీసుకొని చేశా.' అని తెలిపింది ఐశ్వర్య శర్మ. డ్రింకర్ సాయిగా ధర్మ చాలా బాగా నటించారని, సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బావుంటుందని, అర్జున్‌రెడ్డికీ డ్రింకర్‌సాయికీ పోలిక లేదని, అర్జున్ క్లాసీ డ్రింకర్ అయితే.. సాయి మ్యాసీ డ్రింకర్ అని చెప్పింది ఐశ్వర్యశర్మ.

# 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిన 'పుష్ప 2 ది రూల్'

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన క్రేజీ సీక్వెల్ పుష్ప 2 ది రూల్ బాలీవుడ్‌లో సరికొత్త రికార్డును సృష్టించింది. 100 ఏళ్లు కలిగిన బాలీవుడ్ చరిత్రలో ఫస్ట్ టైం ఒక డబ్బింగ్ సినిమా హిందీ సినిమా కంటే అత్యధిక వసూళ్లను సాధించింది. పుష్ప 2 ది రూల్ విడుదలైన మొదటిరోజు నుంచే హిందీలో రికార్డులను నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షారుఖ్ ఖాన్ జవాన్ రికార్డును బద్దలు కొట్టి అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచిన ఈ చిత్రం తాజాగా మరో అరుదైన రికార్డును అందుకుంది. ఈ సినిమా తాజాగా రూ. 1500 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయ్యింది. ఇందులో వరల్డ్ వైడ్‌గా రూ.900 కోట్లు రాగా.. కేవలం హిందీలోనే రూ.632 కోట్ల వసూళ్లను సాధించింది. దీంతో ఫస్ట్ టైం రూ.632 కోట్లు దాటిన హిందీ సినిమాగా చరిత్ర సృష్టించింది. దీంతో 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన మొదటి చిత్రంగా పుష్ప 2 రికార్డులకెక్కింది. పుష్ప 2 కంటే ముందు ఈ రికార్డు 'స్త్రీ 2' సినిమాపై ఉంది. ఈ చిత్రం రూ.625 కోట్లు వసూళ్లను సాధించి ప్రస్తుతం రెండో స్థానంలో నిలిచింది. అలాగే ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన రెండో చిత్రంగా పుష్ప 2 నిలిచింది.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com